సాక్షి
వనపర్తి
ఆదివారం, 5, మే, 2024



మోదీ హయాంలోనే..
ప్రధాని మోదీ హయాంలోనే అభివృద్ధి సాధ్యమని కేంద్ర మంత్రి మురుగన్ అన్నారు.
వివరాలు IIలో ▸



..సంక్షేమ ఫలాలు
కాంగ్రెస్ పాలనతోనే పేదలకు సంక్షేమ ఫలాలు అందుతాయని మంత్రి జూపల్లి అన్నారు.
వివరాలు IIలో ▸



వాతావరణం
ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం వేళ ఉక్కపోత ఉంటుంది. అప్పుడప్పుడు వడగాల్పులు వీస్తాయి.

పాలమూరుకు ఎంత చేసినా తక్కువే..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- కొత్తకోటలో కాంగ్రెస్ రోడ్‌షో, కార్నర్ మీటింగ్
- ఇద్దరు ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపు
- జనసంద్రమైన బస్టాండ్ చౌరస్తా.. హస్తం శ్రేణుల్లో జోష్



మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి.. చిత్రంలో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థులు వంశీచంద్‌రెడ్డి, మల్లు రవి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: 'నేను అమెరికాలో చదువుకునో, రాజకీయ వారసత్వంతోనో ముఖ్యమంత్రిని కాలేదు. నల్లమలలోని కొండారెడ్డిపల్లిలో పుట్టిన నేను వనపర్తిలోని జెడ్పీ స్కూలులో, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివా. వనపర్తిలోని ప్రతి గల్లీ, ప్రతీ వీధితో నాకు గత 40 ఏళ్లుగా అనుబంధం ఉంది. ఇక్కడే పోలీస్ ఉద్యోగం చేసిన మా అన్న భూపాల్‌రెడ్డి చాలామందికి తెలుసు. ఇంటర్ చదువుతున్నప్పుడు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిన్నారెడ్డికి రాజీవ్‌గాంధీ ఎమ్మెల్యే టికెట్ ఇస్తే.. చిన్నన్న గెలుపు కోసం వనపర్తి, కొత్తకోటలోని గల్లీల్లో గోడల మీద రాతలు రాసినోడిని. మీ చెమటతో ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాలకు గానూ 12 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి తెలంగాణలో రెండో సీఎంగా నన్ను కూర్చోబెట్టారు. పాలమూరు బిడ్డలు నాటిన మొక్క నేడు వృక్షంలా మారి ముఖ్యమంత్రిగా ఎదిగాడు. మీ ఆదరణకు ఈ జన్మలో ఎంత చేసినా తక్కువే.' అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గ పరిధి వనపర్తి జిల్లా కొత్తకోటలో శనివారం కాంగ్రెస్ నిర్వహించిన రోడ్‌షో, జనజాతర కార్నర్ మీటింగ్‌కు జనం పోటెత్తారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. ఈ జనసందోహాన్ని చూస్తుంటే కృష్ణానది పరవళ్లు తొక్కుతూ సునామీ లాగా వచ్చి కొత్తకోటను కప్పేసినట్టుగా ఉందన్నారు. 'మీ ఆదరణకు నా మనసు తన్మయత్వాన్ని పొందుతోంది. మీ అభిమానానికి, మీరిచ్చిన ఆశీర్వాదానికి ఈ జన్మలో ఏం చేసినా, ఎంత ఇచ్చినా తక్కువే. ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకునే.



కొత్తకోట కార్నర్ మీటింగ్‌కు హాజరైన కాంగ్రెస్ శ్రేణులు

పాలమూరు బిడ్డగా ఇక్కడి ప్రజల వలసలు ఆపేందుకు, పచ్చని పంటలు పండించేందుకు నా ఆరాటం ఆగదు.' అని అన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపించాలనడం తప్పా..

కాంగ్రెస్ పార్టీ నాకు కొడంగల్‌లో ఎమ్మెల్యే టికెట్ ఇచ్చింది. ఓడిపోయినా.. మల్కాజిగిరి నుంచి పోటీ చేసి ఎంపీగా గెలిచినా. కాంగ్రెస్ అధ్యక్షుడిగా అయ్యా.. ఇప్పుడు సీఎం అయ్యాను. గవర్నమెంట్ స్కూల్‌లో చదువుకున్న నన్ను కాంగ్రెస్ సీఎం చేసింది. అందుకు కాంగ్రెస్ అభ్యర్థిని ఎంపీగా గెలిపించండి.. అభివృద్ధికి పాటుపడతా అంటే అది నేను చేసిన తప్పా.. నేరమా? ఢిల్లీకి రాజైనా తల్లికి బిడ్డనే కదా.. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని అనుకుంటున్నా. ఉమ్మడి పాలమూరులో 14 అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధికి ప్రణాళికలు వేయాలని చిన్నారెడ్డికి బాధ్యతలు అప్పగించినం. మాదిగల వర్గీకరణ, ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏకి మార్చడం, వాల్మీకి బోయలను ఎస్టీలో చేర్చేందుకు కాంగ్రెస్ కృషి చేస్తుంది. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా రావాలంటే మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ అభ్యర్థులు వంశీచంద్‌రెడ్డి, మల్లురవిని గెలిపించాలి.

> '2001లో తెలంగాణ ఉద్యమం మొదలుబెట్టిన చిన్నారెడ్డికి, ఉత్తమ పార్లమెంటేరియన్, నిజాయితీ ఉన్న నాయకుడు జైపాల్‌రెడ్డికి, మల్లు అనంతరాములు, మల్లికార్జున్, మహేంద్రనాథ్ వంటి నేతలకు ముఖ్యమంత్రులుగా అవకాశం రాలేదు. ఇంతటి గొప్ప అవకాశాన్ని పాలమూరుకు చెందిన ముఖ్యమంత్రి బూర్గుల తర్వాత మళ్లీ నాకు ప్రసాదించారు. ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి మీ రుణం తీర్చుకుంటా.'

శత్రువంచన చేరి దెబ్బతీయాలని చూస్తున్నారు..

పాలమూరు బిడ్డ సీఎంగా ఉండొద్దు.. ఈ ప్రభుత్వాన్ని పడగొడ్తామని అంటున్నారు. పార్టీలు, జెండాలు, ఎజెండాలకతీతంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే అవకాశం ముఖ్యమంత్రిగా నాకు వచ్చింది. కానీ ఇక్కడి వారే శత్రువంచన చేరి దెబ్బతీయాలని చూస్తున్నారని మండిపడ్డారు. డీకే అరుణ ఏమంటాంది.. రేవంత్‌రెడ్డి నా మీద పగబట్టిండు. నన్ను ఓడగొట్టాలని చూస్తున్నా డు. నేను మాత్రం కాంగ్రెస్‌ను ఓడగొట్టే వరకు ఊరుకోను. . ఖతం చేస్తా అంటది. కాంగ్రెస్ నీకు ఏం అన్యాయం చేసింది? పాన్‌గల్ నుంచి జెడ్పీటీసీగా, గద్వాల ఎమ్మెల్యేగా, ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిని చేసినందుకు కాంగ్రెస్‌ను ఓడగొట్టాల్నా? దేశం, రాష్ట్రంలో నిన్ను గుర్తు పడుతోంది కాంగ్రెస్‌తోనే కదా.

ఆషామాషీ ఎన్నికలు కావు..

చుట్టంలాగా వస్తడు, పోతడు. పదేండ్లు ప్రధానమంత్రిగా ఉన్న పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు ఎందుకు జాతీయ హోదా ఇవ్వలేదు.. మాదిగల వర్గీకరణ చేయలేదు.. ముదిరాజ్‌లను ఆదుకోలేదు.. బోయలను ఎస్టీ జాబితాలో చేర్చలేదు? అరుణమ్మ గద్వాలను కదా.. బోయల గురించి ఆమెకు తెలుసుకదా ? వీళ్ల గురించి ఆమె ఎప్పుడైనా మాట్లాడిందా? తుమ్మిళ్ల, ఆర్డీఎస్ పూర్తి చేయాలని చూసిందా? జూరాల నీళ్లు రాకపోతే మాట్లాడిందా? భీమా నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, రామన్‌పాడు మరమ్మతుల ఆలోచన చేసిందా? కానీ ఆమె మాత్రం బీజేపీలో జాతీయ ఉపాధ్యక్షురాలు పదవి తెచ్చుకుంది. ఆమెకు కర్ణాటకలో వ్యాపారాలకు ఇబ్బంది లేదు. ఏ రోజైనా ఈ జిల్లాకు సంబంధించి హైదరాబాద్–బెంగళూరు హైవేపై పరిశ్రమల కోసం మోదీతో మాట్లాడిందా? ఏ ప్రయత్నం చేయలేదు.. పరిశ్రమలు వస్తే వేలాది మందికి ఉద్యోగాలొచ్చేవి. ఇవి ఆషామాషీ ఎన్నికలు కావు.. ఆలోచన చేయండి. సభలో నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవి, ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ జిల్లెల చిన్నారెడ్డి, ఢిల్లీలో అధికార ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, మహబూబ్‌నగర్ జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, వనపర్తి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రాహుల్‌గాంధీ రాక

- ఎర్రవల్లి చౌరస్తాలో రాహుల్ సభకు భారీ ఏర్పాట్లు
- హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి
- లక్ష మందిని తరలించేలా నేతల సన్నద్ధం
- వెయ్యి మంది సిబ్బందితో పోలీస్ బందోబస్తు

వివరాలు IIలో ▸



– అలంపూర్/ ఎర్రవల్లి చౌరస్తా

వీడియోలు, ప్రకటనలపై ప్రత్యేక దృష్టి

- పార్లమెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకుడు సౌరభ్



మాట్లాడుతున్న పార్లమెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకుడు సౌరభ్, పక్కన అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

వనపర్తి: సామాజిక మాధ్యమాల వేదికగా ఓటర్లను ప్రభావితం చేసే వీడియోలు, ప్రకటనలపై దృష్టి సారించాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకుడు సౌరభ్ ఆదేశించారు. శనివారం జిల్లాకు వచ్చిన ఆయన అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ఎన్నికలకు సంబంధించిన ప్రకటనలు, వీడియోలు ఎవరికి అనుకూలంగా ఉన్నాయో గుర్తించి వారి లెక్కల్లో జమ చేయాలన్నారు. పెయిడ్ న్యూస్ గుర్తించాలని, ప్రకటనలు ఏ విధంగా గుర్తిస్తున్నారనే విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమీకృత కంట్రోల్ రూమ్‌ను, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాల పనితీరును పరిశీలించారు. సి–విజిల్ యాప్, టోల్ ఫ్రీ నంబర్ 1950కి వచ్చిన ఫిర్యాదులు, పరిష్కరించిన వాటి సంఖ్య, అందుకు తీసుకున్న సమయాన్ని ఆన్‌లైన్‌లో చూశారు. అనంతరం అకౌంట్స్ బృందంతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నియమావళి కచ్చితంగా అమలు చేయాలని, షాడో రిజిస్టర్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించి తమ వద్ద ఉన్న రికార్డులతో సరిచూసుకోవాలని ఆదేశించారు. పోటీలో ఉన్న అభ్యర్థుల ఖర్చు, ఎన్నికల వ్యయ లెక్కింపుపై దృష్టి సారించాలన్నారు. బ్యాంకు లావాదేవీలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, అనుమానిత లావాదేవీలను గుర్తించాలని కోరారు. రూ.10 లక్షల కన్నా ఎక్కువ డబ్బు ఏదైనా బ్యాంకు నుండి విత్‌డ్రా అయ్యిందా? బ్యాంకు నుంచి డబ్బు సరఫరా చేసే వాహనాల్లో సరైన లెక్కలు, సంబంధించిన క్యూఆర్ కోడ్ ఉందా అనేది చూడాలన్నారు. ఏఓ భాను ప్రకాష్, డీపీఆర్ఓ సీతారాంనాయక్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీ హామీలు నమ్మొద్దు



వెంకటాపురంలో మాట్లాడుతున్న జి.చిన్నారెడ్డి

పెబ్బేరు రూరల్: బీఆర్ఎస్, బీజేపీ నేతలు ఇచ్చే మోసపూరిత హామీలు నమ్మి మోసపోవద్దని, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి మల్లు రవిని భారీ మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి కోరారు. శనివారం శ్రీరంగాపురం రంగనాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్‌తో కలిసి మండల కేంద్రంతో పాటు వెంకటాపురం, నాగరాల, నాగసానిపల్లి, తాటిపాముల, కంభాళాపురం, జానంపేట, శేరుపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ని ఆదరించి, అహంకార బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపారని, అదేవిధంగా పార్లమెంట్ ఎన్నికల్లోనూ బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపి కేంద్రంలో కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టాలని కోరారు. రాములుయాదవ్, ఎద్దుల విజయవర్ధన్‌రెడ్డి, గౌని బుచ్చారెడ్డి, కృష్ణ, గణేష్‌గౌడ్, కదిరె రాములు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కాంగ్రెస్ గూటికి పెబ్బేరు ఎంపీపీ



పెబ్బేరు రూరల్: పెబ్బేరు ఎంపీపీ ఆవుల శైలజ మండలంలోని సూగూరు, అయ్యవారిపల్లి, తిప్పాయపల్లి గ్రామాలకు చెందిన సుమారు 200 మంది బీఆర్ఎస్ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి శనివారం కాంగ్రెస్‌పార్టీలో చేరారు. జిల్లాకేంద్రంలోని నందిహిల్స్‌లో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తాము ఎల్లవేళలా అందుబాటులో ఉండి గ్రామాభివృద్ధికి కృషి చేసినా బీఆర్ఎస్ పార్టీలో తగిన గౌరవం దక్కలేదని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో మహేశ్వర్‌రెడ్డి, స్వాతి ,ప్రభాకర్‌గౌడ్ ,కురుమూర్తి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, భానుప్రకాష్‌రెడ్డి, రంజిత్‌కుమార్, సురేందర్‌గౌడ్, వెంకటేష్ సాగర్ పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు వాక్సినేషన్ పూర్తి



వనపర్తిటౌన్: మక్కా యాత్రతో మనిషి పునర్జన్మ ఎత్తి మహ్మద్ ప్రవక్త బోధనలకు అనుగుణంగా కొత్త జీవితం గడపడమేనని ముస్లిం మతపెద్దలు ఆరీస్ మౌలానా, అన్వర్ మౌలానా, మైనుద్దీన్, సయ్యద్ అక్తర్, అఫ్జలుద్దీన్, మునీరోద్దీన్ అన్నారు. హజ్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 13న మక్కా యాత్రకు బయలుదేరే రషీద్ ఇమామ్, మహ్మద్ ఖాజా, సైఫోద్దీన్‌తో పాటు జిల్లాకు చెందిన మరో 11 మందికి శనివారం జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వాక్సినేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. ఇదివరకే వైద్య పరీక్షలు నిర్వహించుకున్న యాత్రికులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు వాక్సినేషన్ చేశారు. ఈ వాక్సిన్ ఇతర దేశాల వాతావరణానికి అనుకూలంగా జీవించేందుకు ఉపకరిస్తుందని డా. పరిమిళ తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అనీస్, గులాం ఖాదర్‌ఖాన్, ఖలీల్, ఎంఆర్ సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో అధికారులదే కీలకపాత్ర



అవగాహన కల్పిస్తున్న తేజస్ పవార్

వనపర్తి: ప్రజాస్వామ్య విలువలు కాపాడటానికి ఎన్నికలను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించడం చాలా ముఖ్యమని జిల్లా ఎన్నికల అధికారి తేజస్ పవార్ అన్నారు. రెండోవిడత ర్యాండమైజేషన్ తర్వాత వనపర్తి నియోజకవర్గానికి కేటాయించిన 360 మంది పీఓలు, సహాయ పీఓలకు ఎన్నికల నిర్వహణ, ఈవీఎంలపై శనివారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎన్నికల అధికారి తేజస్ పవార్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ రోజున పాటించాల్సిన నియమాలు, బాధ్యతలను వివరించారు. ఈవీఎంల నిర్వహణ, వివిధ రకాల ఫారాలు నింపడంలో చిన్న సందేహం ఉన్నా మాస్టర్ ట్రైనర్‌తో నివృత్తి చేసుకోవాలని సూచించారు. పోలింగ్ రోజున ఒక్క తప్పు కూడా జరగడానికి వీలు లేదని, పీఓ డైరీని బాగా చదవాలని, పోలింగ్ రోజున పోలింగ్ స్టేషన్‌కు సుప్రీం బాస్‌గా ఉంటారని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు విధుల్లో కఠినంగా ఉండాలన్నారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే సెక్టోరియల్ అధికారులకు తెలియజేసి సాయం పొందాలని కోరారు. మరో 367 మంది పీఓలు, సహాయ పీఓలకు మే 6న శిక్షణ ఉంటుందని చెప్పారు. ఈసారి 19 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నందున రెండు బ్యాలెట్ యూనిట్లు ఉంటాయని, ఈవీఎంలను ఎలా అనుసంధానం చేయాలో ఒకటికి రెండు సార్లు చూసుకోవాలన్నారు.

జీవితంలో విద్యార్థి దశ కీలకం



మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత

వనపర్తిటౌన్: ప్రతి విద్యార్థి జీవితంలో ఉపాధ్యాయులు, అధ్యాపకుల పాత్ర ఎంతో కీలకమైందని ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్.సురేష్ అధ్యక్షతన జరిగిన కళాశాల వార్షికోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి వెలిగించి మాట్లాడారు. విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉందని.. ప్రతి వ్యక్తికి విద్యార్థి దశ ఎంతో కీలకమైందని తెలిపారు. గురువులు శ్రమించి విద్యార్థులకు తమ జ్ఞానాన్ని ధార పోస్తారని.. సద్వినియోగం చేసుకున్న విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులు, అధ్యాపకులు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. మహిళా డిగ్రీ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉండటం విద్యార్థినుల అదృష్టమని కొనియాడారు. అంతకుముందు కళాశాల ప్రిన్సిపాల్ కళాశాలలో ఉన్న కోర్సులు, విశిష్ట సేవలు, విద్యార్థులు సాధించిన విజయాల నివేదిక చదివి వినిపించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ డా. వెంకటప్రసాద్, అధ్యాపక బృందం ప్రధాన న్యాయమూర్తిని శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. అలాగే ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి



వార్షికోత్సవంలో పాల్గొన్న అదనపు ఎస్పీ రామదాసు తేజావత్, యూనివర్సిటీ ప్రొఫెసర్లు

వనపర్తిటౌన్: సాంకేతిక విద్యలో విద్యార్థులు దేశం గర్వించేస్థాయికి ఉన్నతంగా ఎదగాలని హైదరాబాద్ జేఎన్‌టీయూ ప్రొఫెసర్ ఇందిరారాణి, అడిషనల్ ఎస్పీ రామదాసు తేజావత్ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఓ గార్డెన్స్‌లో నిర్వహించిన వనపర్తి ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ప్రథమ వార్షికోత్సవానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. వనపర్తిలో స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలోనే సాంకేతిక విద్య అందుబాటులోకి వచ్చిందని.. ఇక్కడ దేశ విదేశాలకు చెందిన విద్యార్థులు సైతం విద్యనభ్యసించారని గుర్తుచేశారు. ఆధునిక సాంకేతికతను వినియోగించుకుని దేశ భద్రతలో యువత పాత్ర మెరుగుపడేలా చొరవ చూపాలని ఆకాంక్షించారు. జిల్లాలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటై ఏడాది పూర్తి చేసుకోవడం అభినందనీయమని కొనియాడారు. సాంకేతిక విద్యతో విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి మరింత పెరుగుతుందని చెప్పారు. అనంతరం విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎన్‌వీఎస్ రాజు, ప్రభుత్వ కో–ఎడ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. శ్రీనివాసులు, డా. సీహెచ్ ఆశాజ్యోతి, విద్యార్థులు తదిరులు పాల్గొన్నారు.

నేడు రాహుల్‌గాంధీ రాక


ఎర్రవల్లి చౌరస్తా సభా ప్రాంగణం వద్ద సూచనలు చేస్తున్న ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్


ఎర్రవల్లిలో బహిరంగ సభ బందోబస్తుపై అధికారులతో చర్చిస్తున్న డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, కలెక్టర్ సంతోష్, ఎస్పీ రితిరాజా తదితరులు

- ఎర్రవల్లి చౌరస్తాలో రాహుల్ సభకు భారీ ఏర్పాట్లు
- హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి
- లక్ష మందిని తరలించేలా నేతల సన్నద్ధం

అలంపూర్/ ఎర్రవల్లి చౌరస్తా: జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ఆయా పార్టీల అభ్యర్థులకు మద్దతుగా బడా నేతల రాక కొనసాగుతుంది. ఈ క్రమంలోనే జిల్లాకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి ఆదివారం విచ్చేయనున్నారు. ఈ మేరకు ఎర్రవల్లి చౌరస్తాలో నిర్వహించే జన జాతర భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. ఇప్పటికే సభా ప్రాంగణాన్ని సిద్ధం చేయగా.. ఎర్రవల్లి చౌరస్తా కూడలి నుంచి అలంపూర్‌కు వచ్చే మార్గంలో ఇతర పనులు చకచకా జరుగుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో వేసవి ఎండలు దంచికొడుతుండటంతో వచ్చే నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చలువ పందిళ్లను ఏర్పాటు చేస్తున్నారు. గద్వాలతోపాటు ఉమ్మడి జిల్లాలోని ఆయా ప్రాంతాల నుంచి తరలి వచ్చే నాయకులు, కార్యకర్తలు, ప్రజల కోసం సభా ప్రాంగణాల వద్ద భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. వేసవి ఎండలు తీవ్రంగా ఉండటంతో అందుకు అనుగుణంగా ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నారు. లక్ష మందికి అనువుగా ఉండేలా సభా ప్రాంగణాన్ని తీర్చిదిద్దుతున్నారు. ఇక్కడికి వచ్చే ప్రజలు, వీఐపీల రాకపోకలకు ప్రత్యేక మార్గాల ఏర్పాటుపై దృష్టిసారించారు. 44వ జాయతీ రహదారిలోని నాలుగు మార్గాల నుంచి వచ్చే ప్రజలు, కార్యకర్తలకు అనువుగా కూడలి నుంచి కర్నూలు మార్గంలో ఉన్న జాతీయ రహదారి పక్కన సభను ఏర్పాటు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలు, మార్గాల ద్వారా సభా ప్రాంగణానికి చేరుకునే వారి వాహనాలు పార్కింగ్ చేసుకోవడానికి ప్రత్యేకంగా స్థలాలను గుర్తించారు.

పరిశీలించిన అధికారులు

రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి హెలీకాప్టర్‌లో పదో బెటాలియన్‌లో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌లో సాయంత్రం 4 గంటల సమయంలో చేరుకుంటారు. అక్కడి నుంచి ర్యాలీగా సభా ప్రాంగణానికి వస్తారు. వీరి పర్యటన నేపథ్యంలో సుమారు వెయ్యి మందితో సభా ప్రాంగణం వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు కల్పించనున్నారు. ఈ మేరకు శనివారం సభా ప్రాంగణాన్ని పలువురు అధికారులు పరిశీలించారు. డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, కలెక్టర్ సంతోష్, ఎస్పీ రితిరాజ సందర్శించి పరిస్థితులను సమీక్షించారు. బహిరంగ సభాస్థలం, హెలీప్యాడ్, సీఎం రూట్ మ్యాప్, వీఐపీ పార్కింగ్, ట్రాఫిక్ రూట్లు, సభా స్థలానికి వెళ్లే దారులు, జనరల్ పార్కింగ్, గ్యాలరీ ప్రదేశాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అలాగే ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, ఎంపీ అభ్యర్థి మల్లు రవి ఏర్పాట్లను పరిశీలించారు. వారి వెంట ఏఎస్పీ గుణశేఖర్, పదో పటాలం కమాండెంట్ సాంబయ్య, డీఎస్పీలు సత్యనారాయణ, నరేందర్, సీఐ రవిబాబు, ఎస్ఐ వెంకటేష్ ఉన్నారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

ఇందిరమ్మ రాజ్యంలో సంక్షేమ ఫలాలు

- మంత్రి జూపల్లి కృష్ణారావు


చిరువ్యాపారులతో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

పెంట్లవెల్లి: కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే దేశంలో ప్రజలకు న్యాయం జరుగుతుందని, ఇందిరమ్మ రాజ్యంలో సంక్షేమ ఫలాలు అందుతాయని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం పెంట్లవెల్లి కొత్తబస్టాండ్‌లో, ఎస్సీ కాలనీలో, ప్రధాన రహదారిపై గడప గడపకు తిరిగి మంత్రి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవికి ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. అనంతరం ఎంపీ అభ్యర్థి మల్లురవి మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే ప్రజలకు సంపూర్ణ న్యాయం జరుగుతుందన్నారు. 100 రోజుల ప్రజాప్రభుత్వంలో యువన్యాయం, మహిళా న్యాయం, రైతు న్యాయం, శ్రామిక న్యాయం, సమానత్వ న్యాయం జరిగిందన్నారు. ఎలక్షన్ అయిన వెంటనే కాంగ్రెస్ పార్టీ చేసిన ప్రతి హామీని వెంటనే నెరవేరుస్తుందని మల్లురవి అన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్, రామన్‌గౌడ్, కబీర్‌పాషా, నర్సింహనాయుడు, శేషు, శ్రీనివాసులు, ఆసీఫ్ పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల పేరుతో 420 అబద్ధాలు


బిజినేపల్లిలో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

బిజినేపల్లి: కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల పేరుతో 420 అబద్ధాలు చెప్పి, రాత్రికి రాత్రే కేసుల కొద్ది మద్యం దింపి, జనాలతో ఓటేయించుకుని మోసం చేసిందని బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం బిజినేపల్లి, తిమ్మాజిపేటలో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డితో కలిసి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్‌కు మరోసారి ఓటేస్తే కరెంట్ రాదని, నీళ్లు రావని ఎద్దేవా చేశారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గానికి నిజమైన ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి కాదని, ప్రజల గుండెల్లో ఉన్న మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. ఇలాంటి నాయకుడిని మరోమారు ఎమ్మెల్యేగా చూడాలంటే తనకు ఓటేసి గెలిపిస్తే వచ్చే ఎన్నికల్లో మర్రి జనార్దన్‌రెడ్డి ఎమ్మెల్యే అవుతారన్నారు. మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ కల్యాణలక్ష్మి పథకానికి మరో తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకు తులం ఇనుప ముక్క కూడా ఇవ్వలేదని దుయ్యబట్టారు. రూ.500లకు సిలిండర్ ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు అమలు చేయలేదని, రైతు రుణమాఫీ అతీగతీ లేదని ఆరోపించారు. ఇలాంటి ప్రభుత్వం చేత పని చేయించాలంటే కచ్చితంగా బీఆర్ఎస్ పార్టీ ఎంపీలను గెలిపించాలని, లేకుంటే ఆ పథకాలు అందవని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీ సభ్యుడు బాలస్వామి, నాయకులు మహేశ్వర్‌రెడ్డి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీగా ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా



తెలకపల్లి: తనను ఎంపీగా గెలిపించి ఆశీర్వదిస్తే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి అండగా ఉంటానని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని వీధుల్లో మహిళలు, పార్టీ కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం బస్టాండ్ కూడలిలో మాట్లాడారు. ఈ ప్రాంతంలో మరింత అభివృద్ధి జరగాలంటే నరేంద్రమోదీ ప్రధానిగా ఉండాలని.. ఆయన ప్రధాని కావాలంటే తనను ఎంపీగా గెలిపించాలని అభ్యర్థించారు. తన తండ్రి పోతుగంటి రాములు ఎంపీగా ఎంతో అభివృద్ధి చేశారని.. మీ ప్రాంత బిడ్డగా, గ్రామ మనువడిగా ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి దిలీపాచారి, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సుబ్బారెడ్డి, జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడు రమణారెడ్డి, మైనార్టీమోర్చా జిల్లా అధ్యక్షుడు జాకీర్‌హుస్సేన్, జిల్లా అధికార ప్రతినిధి కొత్తపల్లి రవికుమార్‌రెడ్డి, బాబుసాగర్, కనుకు రమేష్, లక్ష్మణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించని కేంద్రం

- పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ రాఘవాచారి



నారాయణపేట: దేశంలోని ప్రజల సమస్యలు పరిష్కరించకుండా పదేళ్ల పాలన సాగించిన బీజేపీ మరోసారి కేంద్రంలో అధికారం ఎలా చేపట్టగలదో మోదీని ప్రజలు ప్రశ్నించాలని పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ రాఘవాచారి కోరారు. శనివారం జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ రూపొందించిన కరపత్రాన్ని విడుదల చేసిన అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అవినీతి, అప్రజాస్వామిక, నిరంకుశ పాలన సాగించిన బీఆర్ఎస్ పార్టీని 2023 అసెంబ్లీ ఎన్నికల్లో చిత్తుగా ఓడించిన రాష్ట్ర ప్రజలకు ప్రత్యేక వందనాలు తెలియజేస్తున్నామని చెప్పారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం రూ.7 లక్షల కోట్ల అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, ఆర్థిక అరాచకత్వాన్ని అర్థం చేసుకొని బీఆర్ఎస్ పార్టీని లోక్‌సభ ఎన్నికల్లోనూ ప్రజలు తప్పకుండా ఓడిస్తారన్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వానికి మూడోసారి అధికారం ఇవ్వాలని కోరుతూ వస్తున్న బీజేపీ నాయకులను కేంద్రంలో వారి పాలన వైఫల్యాలపై నిలదీయాలని కోరారు. పదేళ్ల పాలనలో ప్రజలకు ఏం చేశారో చెప్పకుండా మత విద్వేషాలు పెంచే రాజకీయాలు ఎందుకు చేస్తున్నారో నిలదీయాలన్నారు. పెట్రోల్, డీజిల్‌పై రూ.లక్షల కోట్ల పన్నులు సెస్ రూపంలో ప్రజల నుంచి వసూలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి వాటా ఎందుకు ఇవ్వడం లేదని, నిత్యావసర సరుకుల ధరలు ఎందుకు నియంత్రించలేదని ప్రశ్నించాలని కోరారు. పదేళ్లలో కొత్తగా ఒక్క ప్రభుత్వరంగ సంస్థను, పరిశ్రమను మోదీ ప్రభుత్వం ప్రారంభించలేదని చెప్పారు. సమావేశంలో కూలనిర్మూలన పోరాట సమితి కార్యవర్గ సభ్యుడు చంటి, మహిళా సంరక్షణ సమితి అధ్యక్షురాలు ఈశ్వరమ్మ, ప్రజాకళామండలి కార్యవర్గసభ్యుడు శివకుమార్, పెద్దజట్రం మాజీ సర్పంచ్ కతలప్ప, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు తిమ్మయ్య, పించన్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి యాదయ్య, హైదరాబాద్ టీపీజేఏసీ కో-కన్వీనర్ సత్యనారాయణ, టీపీజేఏసీ మేడ్చల్ కన్వీనర్ ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కోఆర్డినేటర్ల నియామకం


చంద్రకుమార్‌గౌడ్ సంజీవ్ ముదిరాజ్

స్టేషన్ మహబూబ్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో టీపీసీసీ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కోఆర్డినేటర్లను నియామకం చేసింది. మహబూబ్‌నగర్ పార్లమెంట్‌కు మెయిన్ కమిటీ సభ్యురాలిగా దివ్యవాణి చౌదరి, కోఆర్డినేటర్లు డీసీసీ ఉపాధ్యక్షులు సత్తూరు చంద్రకుమార్‌గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్ నియమితులయ్యారు.

శనైశ్వరుడికి ప్రత్యేక పూజలు

బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్‌లో జ్యేష్ఠాదేవి సమేత శనైశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. శనిదోష నివారణ కోసం భక్తులు ఆలయ ప్రధాన అర్చకుడు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి ఆధ్వర్యంలో తిలతైలాభిషేకం, అర్చనలు నిర్వహించారు. అనంతరం శివుడిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు శాంతకుమార్, ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ హయాంలోనే దేశాభివృద్ధి

- రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం కాదు
- ఎన్నికల్లో లబ్ధి కోసమే నిరాధర ఆరోపణలు
- కేంద్ర సమాచార శాఖ మంత్రి మురుగన్


మాట్లాడుతున్న కేంద్ర మంత్రి మురుగన్, డీకే అరుణ

గద్వాల రూరల్: ప్రధాని నరేంద్ర మోదీ హయాంలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని కేంద్ర సమాచార శాఖ మంత్రి మురుగన్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని తెరు మైదానంలో నిర్వహించిన విజయసంకల్ప బహిరంగ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో బీజేపీ 400 లోక్‌సభ స్థానాల్లో విజయం సాధించి, మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రజల్లో బీజేపీకి లభిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు.. నిరాధర ఆరోపణలు చేస్తూ, ఎన్నికల్లో లబ్ధి పొందేలా కుట్రలు చేస్తున్నాయని మండిపడ్డారు. రిజర్వేషన్లకు బీజేపీ ఎప్పుడూ వ్యతిరేకం కాదన్నారు. అంబేద్కర్ అందించిన రాజ్యాంగాన్ని పవిత్ర గ్రంథంగా భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పేదలు, రైతులు, మహిళలు, యువతకు లబ్ధి చేకూరిందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి భరత్ ప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

అబద్ధపు హామీలతో అధికారంలోకి: డీకే అరుణ

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఆరు గ్యారంటీల్లో రూ. 2లక్షల రుణమాఫీ, రైతుబంధు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్ పథకాలు ఎక్కడా అమలు కావడం లేదన్నారు. అదేవిధంగా విద్యార్థులకు స్కూటీలు, ల్యాప్‌టాప్స్, రూ. 5లక్షల క్రెడిట్ కార్డు ఊసేలేదన్నారు. రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అయితే ఆరు గ్యారంటీలు అమలుచేస్తామని మరోసారి మాయమాటలు చెబుతున్నారని ఆరోపించారు. రాష్ట్రాభివృద్ధి, అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాల కోసం మరోసారి నరేంద్ర మోదీ ప్రధాని కావాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీ రాములు, ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్, తల్లోజీ ఆచారి, లోక్‌నాథ్‌రెడ్డి, శివారెడ్డి, రామచంద్రారెడ్డి, రామాంజనేయులు, బండల వెంకట్రాములు, పద్మావతి, కృష్ణవేణి, జయశ్రీ పాల్గొన్నారు.

డీకే అరుణ గెలుపు కోసం కష్టపడాలి


మాట్లాడుతున్న కోలార్ ఎంపీ మునిస్వామి

మద్దూరు: పాలమూరు సమగ్రాభివృద్ధి కోసం అరుణమ్మను గెలిపించుకోవాలని, ఈ ప్రాంత సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న ఆమె గెలుపు కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని కర్ణాటక రాష్ట్రం కోలార్ ఎంపీ మునిస్వామి కార్యకర్తలకు సూచించారు. శనివారం మద్దూరులోని బీజేపీ కార్యాలయంలో మద్దూరు, కొత్తపల్లి మండలాల కార్యకర్తలతో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంపై సమీక్ష నిర్వహించారు. అసంపూర్తిగా ఉన్న శక్తి కేంద్రాల ఇన్‌చార్జులను, అసంపూర్తిగా ఉన్న కమిటీలను పూర్తి చేసుకోవాలని, బూత్ కమిటీ మెంబర్లు ప్రతి ఇంటికి వెళ్లి దేశంలో మోదీ ప్రవేశపెట్టిన పథకాలు ప్రజలకు వివరించాలన్నారు. మూడో సారి మోదీ ప్రధాని కావడం ఖాయమన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పని అయిపోయిందని, బిడ్డ జైలుకు పోయింది, కొడుకుపై కేసు అయింది, అయ్య ఎటు పోతాడో తెలియని పరిస్థితి అని ఎద్దేవా చేశారు. 'పాలమూరు కోసం అరుణమ్మ, దేశం కోసం మోదీ' అనే నినాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో రతంగ్‌పాండురెడ్డి, రఘురామయ్యగౌడ్, శంకర్, సాయిలు, రవికుమార్, చందుగౌడ్, రాములు, చిరంజీవిరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, భవాని, ఆంజనేయులు, గుందప్ప, నర్సింహ, భరత్ పాల్గొన్నారు.

గాంధీ కుటుంబంపై సన్నగిల్లుతున్న విశ్వాసం

- బీజేపీ రాష్ట్ర మేనేజ్‌మెంట్ సెల్ కన్వీనర్ మర్రి శశిధర్‌రెడ్డి


మాట్లాడుతున్న మర్రి శశిధర్‌రెడ్డి

పాలమూరు: కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయలేని నిస్సాహాయస్థితిలో ఉందని.. సీఎం రేవంత్‌రెడ్డి ఎక్కడికి వెళ్తే అక్కడ ఉన్న దేవుళ్లపై ఒట్టు వేస్తూ ఆగష్టు 15 వరకు పంట రుణమాఫీ, రైతుబంధు చెల్లిస్తానంటూ ప్రజలను మభ్యపెడుతున్నారని బీజేపీ రాష్ట్ర మేనేజ్‌మెంట్ సెల్ కన్వీనర్ మర్రి శశిధర్‌రెడ్డి ఆరోపించారు. శనివారం మహబూబ్‌నగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను ఆకర్షించిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కో గ్యారంటీ అమలుకు ఒక్కో తిరకాసు పెడుతోందని ఆరోపించారు. రాహుల్‌గాంధీ వయనాడ్‌లో ఓడిపోతున్నానని తెలుసుకొని మరోచోట పోటీకి సిద్ధమయ్యారని చెప్పారు. మోదీ పాలనలో ప్రపంచ దేశాల్లో భారత్ గౌరవం పెరిగిందని.. ఆర్థిక వ్యవస్థను 11వ స్థానం నుంచి 5వ స్థానానికి తీసుకొచ్చారని, రాబోయే రోజుల్లో మూడో స్థానానికి రానుందని తెలిపారు. ఇక రాష్ట్రంలో బీఆర్ఎస్ భవిష్యత్తు అయోమయంగా ఉందని.. పార్లమెంట్ ఎన్నికల్లో 12 సీట్లు గెలిపిస్తే డిసైడ్ ఫ్యాక్టర్ అవుతామని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మహబూబ్‌నగర్‌లో రూ.26 వేల కోట్ల రీజినల్ రింగ్‌రోడ్ (భారత్‌మాల) ఫేస్-2 నిర్మాణం కాబోతుందని, అలాగే ప్రత్యేక రైల్వేలైన్ రాబోతుందని తెలిపారు. కాంగ్రెస్‌పార్టీ నాయకులు రిజర్వేషన్లు ఎత్తివేస్తారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఈ విషయాన్ని ప్రజలు నమ్మరాదన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పద్మజారెడ్డి, డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి, రాములు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు అభివృద్ధి కోసం ఓటేయండి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వంశీచంద్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే యెన్నం, మన్నె జీవన్‌రెడ్డి తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: పాలమూరు అభివృద్ధి కోసం తనను ఆశీర్వదించి గెలిపించాలని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో శనివారం ఉదయం ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి, శాట్ చైర్మన్ శివసేనారెడ్డి, టీఎస్ఎంఎఫ్‌సీ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్‌లతో కలిసి వంశీచంద్‌రెడ్డి మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు క్రీడాసంఘాల ప్రతినిధులను కలిసి మాట్లాడారు. అభివృద్ధిలో పాలమూరు ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేసి సాగునీరు అందించకుండా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా ప్రజలను మోసం చేసిన బీజేపీని ఓడించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో అభివృద్ధి కేంద్రంగా పాలమూరు జిల్లాను రూపుదిద్దుకోవాలని ప్రయత్నిస్తుంటే బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు సీఎంను అభాసుపాలుచేసి అసత్య ఆరోపణలు చేస్తూ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. మన ప్రాంత అభివృద్ధి, భవిష్యత్ తరాల కోసం కాంగ్రెస్ పార్టీకి ఓటేసి తనను ఎంపీగా గెలిపించాలని కోరారు. క్రీడారంగంలో హైదరాబాద్‌కు దీటుగా పాలమూరులో క్రీడలను అత్యాధునిక సదుపాయాలతో తీర్చిదిద్దుతామని చెప్పారు. అనంతరం స్టేడియంలోని బాస్కెట్‌బాల్, ఇండోర్ హాల్, అథ్లెటిక్స్, వాలీబాల్, ఫుట్‌బాల్ క్రీడాకారులతో కలిసి బాస్కెట్‌బాల్ ఆడారు. అలాగే ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, శివసేనారెడ్డి, మన్నె జీవన్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, నాయకులు వినోద్ కుమార్, చంద్రకుమార్‌గౌడ్, అశ్వత్థామరెడ్డి, ఎన్పీ వెంకటేశ్, సిరాజ్ ఖాద్రీ పాల్గొన్నారు.

పదేళ్ల మోదీ పాలన అవినీతిమయం


సంఘీభావం తెలుపుతున్న కాంగ్రెస్, సీపీఎం నాయకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కేంద్రంలో పదేళ్ల నరేంద్రమోదీ పాలన అవినీతిమయమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు టి.సాగర్ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పార్టీ మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అభివృద్ధిపై ఎలాంటి చర్చ లేకుండా సెంటిమెంట్‌తో మతోన్మాదాన్ని, మైనారిటీలను బూచిగా చూపించి బీజేపీ ఓట్లను అడగడం తగదన్నారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, పేదరికం, అసమానతలు తాండవిస్తున్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో ఇండియా కూటమిలోని కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ సీపీఎం కార్యకర్తలు తన గెలుపు కోసం నిస్వార్థంగా పనిచేస్తారనే నమ్మకం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ కమ్యూనిస్టుల భావజాలానికి ఎంతో దగ్గరగా ఉంటారన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకట్రాములు, నారాయణపేట, వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లాల కార్యదర్శులు వెంకటరామరెడ్డి, ఎండీ జబ్బార్, ఎ.రాములు, నాయకులు కిల్లె గోపాల్, నల్లవెల్లి కురుమూర్తి, ఆర్.రాంరెడ్డి, మహమూద్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ తదితరులు పాల్గొన్నారు.

95 నిమిషాల పాటు సీఎం రోడ్‌షో, కార్నర్ మీటింగ్

వనపర్తి/ కొత్తకోట/ కొత్తకోట రూరల్: మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని కొత్తకోట పట్టణంలో సీఎం రేవంత్‌రెడ్డి శనివారం రోడ్‌షో, కార్నర్‌మీటింగ్ 95 నిమిషాల పాటు సాగింది. కొత్తకోట పోలీస్‌స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు సాయంత్రం 5.35 గంటలకు చేరుకున్నారు.

- సీఎం 5 గంటలకు కొత్తకోటకు చేరుకోవాల్సి ఉండగా అనివార్య కారణాలతో 35 నిమిషాలు ఆలస్యంగా వచ్చారు.
- 6 గంటలకు కార్నర్ మీటింగ్‌కు చేరుకొని.. 27 నిమిషాల పాటు తన ప్రసంగం కొనసాగించారు.
- ఈ క్రమంలో సీఎం స్వయంగా లక్ష మెజార్టీ ఇస్తాం అంటూ మీటింగ్‌కు వచ్చిన నాయకులు, కార్యకర్తలతో నినాదాలు చేయించారు.
- చీకటి పడటంతో రోడ్డు మార్గాన 7.10 గంటలకు రోడ్డు మార్గాన హైదరాబాద్‌కు వెళ్లిపోయారు.


రోడ్‌షోలో అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఎనిమిదేళ్లుగా నిర్లక్ష్యం..: మధుసూదన్‌రెడ్డి

మూడేళ్లలో పూర్తి చేయాల్సిన పాలమూరు-రంగారెడ్డి పథకం పనులను గత ప్రభుత్వం ఎనిమిదేళ్లుగా నిర్లక్ష్యం చేసిందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. నియోజక వర్గానికి డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, కొత్తకోటలో ఉర్దూ మీడియం జూనియర్ కాలేజీ, వందపడకల ఆస్పత్రి , కానాయపల్లి పునరావాస కేంద్రం.. తదితర వాటిని పరిశీలించాలని కోరారు.

గెలిపిస్తే.. రుణం తీర్చుకుంటా..: వంశీచంద్

పదేళ్లు దేశాన్ని, రాష్ట్రాన్ని పట్టిపీడించి ప్రజలను బానిసలుగా చేసి పాలించిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు దీటైన సమాధానం చెప్పాలంటే ఈనెల 13వ తేదీన పెద్ద ఎత్తున ఓటు వేసి తనను గెలిపించాలని మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి అన్నారు. సరైన మద్దతునిచ్చి గెలిపిస్తే పాలమూరు ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు.







మీ నవ్వుల చల్లదనాన్ని మంచుకొండ అప్పుడిగింది...



ఒకరు జోక్ వేస్తే నవ్వడం చాలా వీజీ. నవ్వించడం మాత్రం నవ్వినంత ఈజీ కాదు. టోటల్‌గా చెప్పొచ్చేదేమిటంటే... నవ్వించడం అనేది అత్యంత కష్టతరమైన టాస్క్. ఈ నవ్వుల మహారాణులు మాత్రం అవలీలగా నవ్వులు పూయిస్తూ సోషల్ మీడియాలో లక్షలాది మంది అభిమానులను సంపాదించుకున్నారు.

నిఫ్ట్ గ్రాడ్యుయేట్ అయిన కుష కపిల బిల్లీ మసి, సౌత్ దిల్లీ గర్ల్స్‌లాంటి క్యారెక్టర్లతో నవ్వుల వర్షం కురిపిస్తోంది. ఆమెకు 1.6 మిలియన్‌ల ఫాలోవర్‌లు ఉన్నారు. నిత్యజీవిత సంఘటనల ఆధారంగా దిల్లీకి చెందిన డాలీసింగ్ కామెడీని మేడ్ ఈజీ చేసింది. ముంబైకి చెందిన ప్రజక్తా కోలి కామెడీ వీడియోలు మోస్ట్ పాపులర్ అయ్యాయి. అబ్జర్వేషనల్ కామెడీకి ఆమె వీడియోలు అద్దం పడతాయి. కోలికి యూట్యూబ్‌లో 6 మిలియన్‌ల ఫాలోవర్‌లు ఉన్నారు. స్టాండ్–అప్ కమెడియన్‌గా దేశవ్యాప్తంగా పేరు తెచ్చుకుంది ప్రశస్తి సింగ్. అమెజాన్ ప్రైమ్ వీడియో సిరీస్ 'కామిక్‌స్థాన్' సూపర్ హిట్ అయింది. ఎంబీఏ చేసిన ప్రశస్తి 'నవ్వించడం' తన ప్యాషన్ అంటోంది. వీరు మాత్రమే కాదు కనీజ్ సుర్క, శ్రిష్టి దీక్షిత్, నిహారిక ఎన్‌ఎం, సుప్రియ జోషి, సుముఖి సురేష్, ఐశ్వర్య మోహన్‌రాజ్, సుమైర... లాంటి ఎంతో మంది నవ్వుల ప్రపంచంలో మహారాణులుగా వెలిగిపోతున్నారు.

వైరల్

సిగ్నల్ నీడలో



బతుకు గడవాలంటే రోడ్డు మీదకు రాక తప్పదు. వస్తే భయంకరమైన ఎండ. దాంతోపాటు ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర వేచి ఉండాల్సిన బాధ. అందుకే పాండిచ్చేరి ప్రభుత్వం ప్రతి ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర గ్రీన్‌షేడ్ ఏర్పాటు చేసింది. వీటిని ఒక స్కూటరిస్ట్ 'ఎక్స్'లో షేర్ చేశాడు. వైరల్ అయిన ఈ పందిళ్లను చూసి చాలా మంది తమ నగరాల్లో కూడా ఇలా జరిగితే బాగుండని కోరుకుంటున్నారు.

మన దేశంలో ఎండలు విపరీతమవడం గతంలో కూడా ఉంది. సాధారణంగా మైదానప్రాంతాల్లో 40 డిగ్రీల సెల్సియెస్, కొండ ప్రాంతాల్లో 30 డిగ్రీల సెల్సియెస్ దాటితే వడగాడ్పు ఉన్నట్టు వాతావరణ శాఖ ప్రకటిస్తుంది. 2016లో జోధ్‌పూర్‌లో 51 డిగ్రీల రికార్డు టెంపరేచర్ నమోదైంది. 2019లో లాంగెస్ట్ హీట్‌వేవ్‌ను దేశం చూసింది. 32 రోజుల పాటు సాగిన వడగాడ్పులకు ఆంధ్రప్రదేశ్ అల్లాడిపోయింది విదర్భ, రాజస్థాన్ కాకుండా. అందుకే మన దేశంలో మే నెలను చూసి జనం గడగడ వొణుకుతారు. బయటికొస్తే వాహనదారులకు నిలువ నీడ ఉండదు. ఇలాంటి సమయంలో పాండిచ్చేరిలో ప్రభుత్వం ప్రతి ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర గ్రీన్‌షేడ్స్ ఏర్పాటు చేసింది. దీని వల్ల ఎండలో తిరిగే వారికి నీడ కింద ఉపశమనం దొరికినట్టవుతుంది... దాంతో పాటు ట్రాఫిక్ సిగ్నల్‌ను పాటించినట్టవుతుంది. ఒక వాహనదారుడు ఇన్‌స్టాలో రిలీజ్ చేసిన పాండిచ్చేరి గ్రీన్‌షేడ్స్‌ను చూసి ప్రతి ఒక్కరూ మా నగరాల్లో కూడా ఇలాంటివి ఏర్పాటు చేస్తే బాగుండు అంటున్నారు. ప్రభుత్వాలు వింటే బాగుండు.

నీటి పిట్టలు



'స్విమింగ్ పూల్ అంటే ఎలా ఉంటుంది సార్?'
అని అడిగారా పల్లెటూరి స్కూల్ పిల్లలు.
స్కూల్ ప్రిన్సిపల్‌కి చివుక్కుమంది.
ఎండల్లో జలకాలాడే చిన్న సరదా కూడా
తన స్కూల్ పిల్లలకు లేకపోతే ఎలా అనుకున్నాడు.
ఆ తర్వాత అతడేం చేశాడు?
పిల్లలు నీటి పిట్టలు ఎలా అయ్యారు?
వైరలైన ఈ వివరం వినండి.

ఉత్తరప్రదేశ్‌లో అత్తర్ల తయారీకి వాసికెక్కిన కన్నౌజ్‌కు పక్కనే ఉండే తిర్వా అనే ఊరిలోని ఒక ప్రయివేటు స్కూల్ విద్యార్థులకు స్విమ్మింగ్ పూల్ ఎలా ఉంటుందో తెలియదు. 'వేసవి కాలంలో నగరాల్లో డబ్బున్నవాళ్లు స్విమ్మింగ్‌పూల్‌కు వెళ్లి ఈత కొడతారు' అని స్కూల్ ప్రిన్సిపాల్ వైభవ్ సింగ్ పిల్లలకు మాటవరసకు చెప్తే పిల్లలు 'అదెలా ఉంటుంది సార్' అనడిగారు. 'మేమెందుకు అలాంటి పూల్‌లో ఈత కొట్టకూడదు' అనంటే మన చుట్టుపక్కల పూల్స్ లేవు అని ప్రిన్సిపాల్ అన్నాడు. కాని అతనికి ఒక ఆలోచన వచ్చింది. ఒక క్లాస్‌రూమ్‌లో నీళ్లు నింపి ఇదే పూల్ అన్నాడు. తల్లిదండ్రుల అనుమతి అడిగి స్కూల్ అయ్యే సమయానికి అందులో కేరింతలు కొట్టే అవకాశం ఇచ్చాడు. ఇంకేముంది... పిల్లలకు హుషారే హుషారు. స్కూల్ ఎగ్గొట్టడంలో ఘనాపాఠీలైన పిల్లలు కూడా పలక తీసుకొని పరిగెత్తుకుంటూ వస్తున్నారు. ఊళ్లోని తల్లిదండ్రులు కూడా వచ్చి పిల్లలు నీళ్లల్లో కేరింతలు కొడుతుంటే చూసి సంతోషపడుతున్నారు. ఈ వీడియో వైరల్ అయ్యింది.

కూల్ మీమ్స్



















నేడే చూడండి... గుర్రం గారి డ్యాన్స్



'కొత్త బట్టలు కుట్టిస్తారు. గుర్రపు స్వారీ చేయిస్తారు' అని పెళ్లికుమారుడి గురించి మురిపెంగా చెబుతుంది ఓ సిన్మా పాట. ఈ పాట మాట ఎలా ఉన్నా కొన్ని పెళ్లి ఊరేగింపులలో గుర్రం పరేషాన్ చేస్తుంటుంది. లక్నోలో ఒక పెళ్లి ఊరేగింపులో బాంబుల మోత భరించలేక 'ఐ డోన్ట్ లైక్ ఇట్' అంటూ గుర్రం పరుగులు తీసింది. గుర్రంపై ఉన్న పెళ్లికుమారుడు భయంతో లబోదిబో అన్నాడు. ఇక తాజా విషయానికి ఇస్తే... ఒక పెళ్లి ఊరేగింపులో ఒక కుర్రాడు డ్యాన్స్ చేస్తున్నాడు. లెక్క ప్రకారం అయితే పెళ్లి ఊరేగింపు గుర్రం ఇట్టి దృశ్యాలను మౌనంగా చూస్తుంది. మరి మన గుర్రానికి ఏమనిపించిందో తెలియదుగానీ ఆ డ్యాన్సర్‌కు తగినట్లు స్టెప్పులు వేయడం మొదలుపెట్టింది. గుర్రంపై కూర్చున్న వరుడి గుండెల్లో మెట్రో రైళ్లు పరుగెత్తడం మాట ఎలా ఉన్నా... అక్కడ ఉన్న జనాలకు గుర్రం డ్యాన్స్ తెగ నచ్చి ఈలలు వేయించింది. మనోజ్ పటేల్ అనే యూజర్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో క్లిప్ 21 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది.

హెల్త్

చర్మంపై వేసవి ఎండ ప్రభావం... జాగ్రత్తలు!

మనపై వేసవి ఎండల ప్రభావాలు ఎలా ఉన్నప్పటికీ... నేరుగా ప్రభావితం చేసేది చర్మాన్నే. ఎండ ప్రభావం ప్రత్యక్షంగా ఉండటంతో మేని రంగు మారడం, చర్మం కమిలిపోవడం వంటివి సహజం. ప్రధానంగా చిన్నపిల్లల్లో చెమటకాయలు వంటి సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయి. వేసవి ఎండల్లో చర్మంపై చూపే దుష్ప్రభావాలూ, వాటి నివారణ, చికిత్స వంటి అనేక అంశాలపై అవగాహన కోసం...





వేసవిలో ఈ కింద పేర్కొన్న అనేక రకాల చర్మ సమస్యలు వచ్చే అవకాశముంది.

చెమటకాయలు (మిలీరియా)... చెమటకాయలు ముఖ్యంగా పిల్లల్లోనూ, కొందరు పెద్దల్లో కూడా కనిపిస్తుంటాయి. వేడి వాతావరణంలో చర్మంపైన ఉండే స్వేదగ్రంథులు మూసుకుపోయి వాపు రావడం వల్ల వేసవిలో ఇవి వస్తుంటాయి. చర్మంపైన ఎర్రటి ర్యాష్‌లాగా కొన్నిసార్లు మాడినట్లుగా నలుపురంగులో కనిపిస్తుంటాయి. పిల్లల్లో చెమట గ్రంథులు పూర్తిగా ఎదగక పోవడం, వేడిమి, ఎండలో విపరీతంగా ఆడటం చెమటకాయలు రావడానికి ప్రధాన కారణాలు.

నివారణ / చికిత్స: చెమటకాయలు వచ్చినప్పుడు పిల్లలకు గాలి బాగా ఆడేలా వదులుగా ఉండే దుస్తులు (కాటన్‌వి అయితే మరీ మంచిది) ధరింపజేయాలి.
- గాఢత తక్కువగా ఉండే మైల్డ్ సబ్బులు వాడాలి.
- కాలమైన్ లోషన్ రాసుకోవడం మంచిది.
- పిల్లలు ఎండల్లో ఎక్కువగా ఆడకుండా జాగ్రత్త పడాలి. చికిత్సలో భాగంగా ప్రిక్లీ హీట్ పౌడర్ వాడాలి. తగ్గకపోతే ఎమోలియెంట్స్ అనే క్రీముల్ని డాక్టర్ సలహా మేరకు రాయాలి.

మంగుమచ్చలు/ మెలాస్మా... చర్మానికి హానికరమైన అల్ట్రా వయొలెట్ కిరణాల ప్రభావం వల్ల చర్మంపైన ఉండే మెలనోసైట్స్ అనే కణాలు పెరిగి, చర్మం నల్లబారుతుంది. ఈ పిగ్మెంటేషన్‌ను మెలాస్మా అంటారు.

జాగ్రత్తలు/ చికిత్స: పిగ్మెంటేషన్ ఉన్నవారు రోజూ రాత్రివేళ కోజిక్ యాసిడ్, ఆర్బ్యుటిన్, విటమిన్-సి ఉన్న క్రీములు రాసుకోవాలి.
- 40 ఎస్‌పీఎఫ్ కంటే ఎక్కువగా ఉన్న సన్‌స్క్రీన్‌ను ప్రతి మూడుగంటలకోసారి రాయాలి.

మొటిమలు ఎక్కువగా రావడం.. వేసవి వేడి వాతావరణంలో తేమ (హ్యుమిడిటీ) ఎక్కువగా ఉన్నప్పుడు మన చర్మంపై ఉండే సబేషియస్ గ్రంథులు ఎక్కువగా పనిచేసి, సీబమ్ అనే నూనె లాంటి ద్రవం స్రవిస్తుంది. అలాగే ముఖంపై ఉండే 'పైలో సబేషియస్ యూనిట్' అనే వ్యవస్థ చాలా చురుగ్గా పనిచేయడంతో చర్మంపై ఎక్కువ చెమట పట్టడంతో, సీబమ్ అనే నూనె లాంటి ద్రవాల స్రావాలతోనూ ఈ గ్రంథుల రంధ్రాలు మూసుకుపోతాయి. దాంతో అక్కడ బ్యాక్టీరియా పెరిగి ఇన్‌ఫ్లమేషన్‌కు దారితీస్తుంది. ఇలా ఈ సీజన్ మొటిమల ఎక్కువగా పెరగడానికి కారణమవుతుంటుంది.

నివారణ / చికిత్స : మొటిమల్ని ప్రేరేపించే అంశాల్లో చాక్లెట్లు, కాఫీలోని కెఫిన్ ప్రధానమైనది. అందుకే టీనేజీ పిల్లలకు కొవ్వులు, చక్కెర పాళ్లు తక్కువగా ఉండే ఆరోగ్యకరమైన ఆహారాన్నే ఇవ్వాలి. ఎవరికి వారు తాము తీసుకునే ఆహారాల్లో కొన్ని ఐటమ్స్ సెబేషియస్ గ్రంథులను ప్రేరేపించేవి అని గుర్తిస్తే వాటికి దూరంగా ఉండాలి. ఈ తరహా నివారణ చర్యల తర్వాత కూడా మొటిమలు తగ్గకపోతే అప్పుడు క్వాలిఫైడ్ డర్మటాలజిస్టును కలిసి వారి సూచన మేరకు క్లిండామైసిన్ అండ్ ఎడాపలీన్ కాంబినేషన్ ఉన్న క్రీమును ప్రతి రోజూ రాత్రివేళ రాసుకోవాలి. అప్పటికీ తగ్గకపోతే వైద్యుల సలహా మేరకు యాంటీబయాటిక్స్ కూడా వాడాల్సి ఉంటుంది.



డా. కె.ఎస్.ఎస్. రవితేజ
సీనియర్ డర్మటాలజిస్ట్ & కాస్మటాలజిస్ట్

ఈత జబ్బులతో జర భద్రం

ఒకప్పుడు వేసవి సెలవులు రాగానే ఎనిమిదీ పదేళ్ల పిల్లలంతా ఊళ్లలో బావులకు ఈతకు వెళ్లేవారు. ఇప్పుడా సంఖ్య కాస్త తగ్గినా ఇంకా అలా ఈతకెళ్లేవాళ్లు ఉండనే ఉన్నారు. పల్లెలూ, పట్టణాల పిల్లలైతే సెలవులు కాబట్టి దగ్గర్లోని సముద్ర తీరం దగ్గరికి స్నానాలకు వెళ్లడం, నదుల్లో, చెరువుల్లో ఈదులాడటం మామూలే. ఇక నగరవాసుల పిల్లలు స్విమ్మింగ్ క్లాసులంటూ ఈత నేర్చుకోడాలు ఈ సీజన్‌లోనే ఎక్కువ. దానికితోడు టబ్ బాత్‌లూ, అమ్యూజ్‌మెంట్ పార్కుల్లో స్ప్లాష్ బాత్, కృత్రిమ కెరటాల్లో ఈదులాటలూ ఉంటాయి. అయితే ఈత సంబంధమైన వినోదక్రీడల్లో, వాటర్ స్పోర్ట్స్‌లో పిల్లలకు ప్రమాదాలు తెచ్చిపెట్టే ముప్పులు ఉండనే ఉంటాయి. అవేమిటో, వాటి విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటో చూద్దాం.



ఈత రానప్పుడు... అది స్విమ్మింగ్‌పూల్‌గానీ లేదా చెరువు, వాగు, నదిలో మునిగిపోయే ప్రమాదమే అన్నిటి కంటే పెద్ద ముప్పు. ఇలాంటి సందర్భాల్లో ఈత తెలిసినవారు తప్పక పక్కనే ఉండాలి. పిల్లవాడు మునిగిపోతున్నట్లు గమనించిన వెంటనే ఒడ్డుకు తీసుకువచ్చి సమతలంగా ఉండే ప్రదేశంలో పడుకోబెట్టాలి. కోలుకునేందుకు చేయాల్సిన పరిచర్యలివి...
- ప్రమాదానికి గురైన చిన్నారి తల పక్కకు ఉండేలా, ఎడమవైపు ఒరిగి ఉండేలా చూసుకోవాలి.
- ఛాతీని గమనిస్తూ, శ్వాస ఆడుతుందో లేదో చూడాలి. శ్వాస తీసుకోలేకపోతుంటే గదమ భాగం పైకి ఉండేలా చేసి, గొంతులో ఏదైనా అడ్డుగా ఉందేమో చూడాలి... ఉంటే ఆ అడ్డును తొలగించాలి.
- తర్వాత బోర్లా పడుకోబెట్టి వీపుపై మన రెండు అరచేతులు అనించి, బలంగా నొక్కాలి. దీనివల్ల ఊపిరితిత్తుల్లో ఏమైనా నీళ్లు ఉంటే బయటకు వెళ్లిపోతాయి. శ్వాసక్రియ మళ్లీ మొదలవుతుంది.
- కొందరు నీళ్లు తాగేస్తారు. అలాంటప్పుడు కడుపుపై విడతలవారీగా నొక్కుతూ నీళ్లు బయటకు వెళ్లేలా చేయాలి. దాంతో శ్వాసక్రియ తేలిగ్గా జరుగుతుంది. నోటితో గాలి ఊదేటప్పుడు పిల్లవాడి ముక్కు మూయాలి. మన నోరు పక్కకు తీసినప్పుడు ముక్కు తెరచి ఉంచాలి. ఈ రెండింటి మధ్య కొంత వ్యవధి ఇస్తూ ఒక క్రమపద్ధతిలో చేస్తుండాలి.
- ఆ తర్వాత వాళ్లను పొడిబట్టల్లోకి మార్చాలి.

ఇతర ఆరోగ్య సమస్యలు...

నీళ్ల విరేచనాలు (డయేరియా) : ఈదుతున్న నీళ్లలో ఉండే ఈ–కొలై, షిజెల్లా, క్రిప్టోస్పోరీడియమ్, నోరో వైరస్ వంటి సూక్ష్మక్రిముల వల్ల నీళ్ల విరేచనాల సమస్య రావచ్చు. సమస్య తీవ్రతను బట్టి కొన్ని సందర్భాల్లో యాంటీబయాటిక్స్ వంటి మందులతో పాటు దేహద్రవాలను కోల్పోకుండానే, క్రిములను మాత్రం బయటకు పంపేలా చేసే విరేచనాలు కట్టుబడే మాత్రలు వాడాల్సి ఉంటుంది.



చెవిలో నొప్పి లేదా స్విమ్మర్స్ ఇయర్ : 'ఒటైటిస్ ఎక్స్‌టర్నా' అనే ఈ బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్‌లో చెవి నొప్పి, చెవిలో దురద, నీరుకారడం, చెవి ప్రాంతంలో వాపు కనిపిస్తాయి. దీని నివారణకు ఈత పూర్తి కాగానే తువ్వాలతో చెవుల్ని, ఇయర్ కెనాల్‌నూ పొడిగా మారేలా తుడవాలి. అప్పటికీ తగ్గపోతే డాక్టర్ సలహా మీద చెవుల్లో యాంటీబయాటిక్ చుక్కల మందులు వాడాలి. ఈ ఇబ్బందులు లేకుండా ఉండాలంటే ఈత సమయంలో ఇయర్ ప్లగ్స్ వాడటం మంచిది.

హాట్ టబ్ ర్యాష్ : కలుషితమైన నీళ్లలో ఈదటం వల్ల చర్మానికి వచ్చే సమస్య ఇది. ర్యాష్ వచ్చినచోట చర్మం ఎర్రబారి దురద పెడుతుంటుంది. చర్మంపై రోమాంకురాల చివర్లలో చీముపొక్కుల్లా వస్తుంటాయి. స్విమ్‌సూట్ ధరించిన ప్రాంతాల్లో లక్షణాల తీవ్రత మరీ ఎక్కువ. ఈ సమస్య నివారణకు ఈత పూర్తయిన వెంటనే స్విమ్ సూట్ తొలగించి, సబ్బుతో శుభ్రంగా స్నానం చేయాలి.

కళ్లు ఎర్రబారడం : ఈత తర్వాత చాలామంది కళ్లు ఎర్రబారినట్టుగా ఉంటాయి. ఈదులాడే చోట అనేక రకాల మానవ కాలుష్యాలు, ఇతర రసాయనాల వల్ల నీళ్లు కలుషితం కావడమే ఇందుకు కారణం. ఒకవేళ స్విమ్మింగ్‌పూల్‌లో ఇలాంటి సమస్య వస్తే... ఆ నీటిని క్లోరినేషన్ ద్వారా డిస్-ఇన్‌ఫెక్ట్ చేయాల్సి ఉంటుంది. చెరువు, కొలను వంటి ఇతర వనరులైతే అలాంటి చోట ఈత కొట్టకపోవడమే మేలు.

సైనసైటిస్: నీటి కొలనులు, చెరువుల వంటి చోట్లలో ఈదులాడుతున్నప్పుడు మన తలలో ఉండే సైనస్ అనే ఖాళీ ప్రదేశాలలో నీరు చేరి, అక్కడ సూక్ష్మజీవులు పెరగడం వల్ల ముక్కు నుంచి స్రావాలు కారుతుండటం, ఒక్కోసారి కణతల వద్ద తలలో, చెవుల్లో నొప్పి రావడం వంటి సమస్యలు వస్తుంటాయి. ఇలాంటప్పుడు డాక్టర్ సలహా మేరకు యాంటీబయాటిక్స్, నొప్పి నివారణ మాత్రలు వాడాల్సి రావచ్చు.

ఇతర ఇన్ఫెక్షన్లు : కొన్ని రకాల ఇన్ఫెక్షన్ల వల్ల జ్వరం, ఆకలి తగ్గడం, తలనొప్పి, తీవ్రమైన నిస్సత్తువ వంటి లక్షణాలు కనిపించవచ్చు. అలాగే పిల్లల ప్రైవేట్ పార్ట్స్ దగ్గర పిన్‌వార్మ్స్ వంటి ఇన్ఫెక్షన్లూ వచ్చే ప్రమాదముంది. కొన్ని సందర్భాల్లో ఊపిరితిత్తుల్లోకి కలుషితమైన నీరు ప్రవేశించడం వల్ల తీవ్రమైన దగ్గు లేదా శ్వాస సమస్యలు రావచ్చు.

ఈత సమస్యల నివారణ కోసం...
- పిల్లలు ఈతకొడుతున్నప్పుడు సీఆర్‌పీ వంటి ఫస్ట్ ఎయిడ్ పద్ధతులు, ఈదడం తెలిసిన పెద్దలు తప్పక పక్కనే ఉండి తీరాలి.
- ఈత ఎంతో ఆరోగ్యకరమైన వ్యాయామమైనప్పటికీ దాంతో వచ్చే సమస్యలపై పిల్లలకు అవగాహన కల్పించి, ఆ మేరకు వారు జాగ్రత్తలు తీసుకునేలా వాళ్లలో అవగాహన పెంచాలి.
- పిల్లలు ఈదులాడే కొలను, నదులు, చెరువులు శుభ్రంగానే ఉన్నాయని నిర్ధారణ చేసుకున్న తర్వాతే వారిని ఈతకు అనుమతించాలి. స్విమ్మింగ్‌పూల్ అయితే నిర్ణీత వ్యవధుల్లో ఈ నీటిని క్లోరిన్‌తో ట్రీట్ చేసేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- వీలైతే పిల్లల చెవుల్లోకి నీరు పోకుండా ఇయర్ ప్లగ్స్, కళ్లకు గాగుల్స్ వంటివి ధరించేలా జాగ్రత్తలు తీసుకోవాలి.



డా. ప్రవీణ్‌కుమార్ కులకర్ణి,
సీనియర్ ఇంటర్నల్ మెడిసిన్ స్పెషలిస్ట్

మెడి టిప్

వాటర్ కూలర్‌తో ఒకింత జాగ్రత్త!

చాలారోజుల తర్వాత వాడుతున్న వాటర్ కూలర్ విషయంలో ఒక్క జాగ్రత్త తప్పనిసరిగా పాటించి తీరాలి. అదేమిటంటే... వాటర్ కూలర్‌లో ఎంతోకొంత నీరు ఉండి, దాన్ని చాలారోజుల పాటు ఆన్ చేయకుండా ఉన్నప్పుడు ఆ వాటర్ కూలర్ మెష్‌లో ఉండే బ్యాక్టీరియాతో 'లీజియొనైర్స్ డిసీజ్' అనే వ్యాధి వచ్చే ప్రమాదం ఉంటుంది. లీజియొన్నెల్లా అనే బ్యాక్టీరియా కారణంగా వచ్చే ఈ వ్యాధి వల్ల లంగ్స్ ప్రభావితమవుతాయంటున్నారు డాక్టర్లు. అప్పటికే ఆస్తమా ఉన్నవారిలో ఈ 'లీజియొనైర్స్ డిసీజ్' మరింత ప్రమాదకరం కావచ్చంటూ హెచ్చరిస్తున్నారు. అందుకే కూలర్ వాడే ముందర ఒకసారి అందులోని పాత నీరంతా డ్రై అయిపోయేలా ఆన్ చేసి ఉంచాలి. ఆ తర్వాత కూడా ఒకసారి ఫ్రెష్‌గా మరికాసిని నీళ్లు పోసి, అవి కూడా పూర్తిగా ఇగిరిపోయేలా చేయాలి. అటు తర్వాత తాజాగా నీళ్లు పోసి, అప్పుడు వాడుకోవాలంటూ డాక్టర్లు సలహా ఇస్తున్నారు.

